ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 10 జులై, 2026 | పేజీలు : 08

## 'సర్' ఫారముల ఆన్‌లైన్ పూర్తి చేయాలి



7 లో...

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

### లోటు వర్షపాతంలో కరీంనగర్ జిల్లా
### కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున, ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, వానాకాలం సాగు, తదుపరి కార్యాచరణ అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కూడా కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందించాలన్నారు. ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించారు. దీనివల్ల ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర అధికమించవచ్చని, రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ద్వారా కూడా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నందున, ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లాలో ఎరువుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ రకాలను ప్రతి రైతుకు తెలియజేయాలని అన్నారు. ప్రతి రైతు వేదికను ఉపయోగించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నీటి లభ్యత, విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు



సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారుల సూచనలు రైతులు పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు.అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబిజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

## విపత్తుల సమయంలో..
# ఎడిఆర్ఆర్ఎఫ్ కీలకం



తరువాయి 2 లో...

కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పి మహేష్ బి గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆద్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం, గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీపీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా,

# మెనూ ప్రకారం భోజనం

### ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయం శుభ్రంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



తరువాయి 2 లో...

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం భోజనం పరిశుభ్రత, నిరంతర తనిఖీలు తదితర అంశాలపై జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ట్రైబల్ వెల్ఫేర్ డీసీఓలు, ఈ ఎం ఆర్ ఎస్ ప్రిన్సిపాళ్ళు, వివిధ శాఖల అధికారులతో పంచాయతీరాజ్ టి జి ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయం లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గురువారం సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలకు ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ నియమించారు. ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, అలాగే టాస్క్ ఫోర్స్ టీంలు తనిఖీ చేసిన సందర్భంగా గుర్తించిన ఇబ్బందులు, ఇంకా కావాల్సిన ఏర్పాట్లపై సిద్ధం చేసిన నివేదికపై సమీక్ష చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, దీనిని అన్ని గురుకులాల డీసీఓ లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## పారమిత పాఠశాలలో నమూనా ఎన్నికలు

ప్రజాపక్షం / కొత్తపల్లి : కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యార్థి మంత్రి మండలిని ఎన్నుకోవడం కోసం ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, క్రీడా రంగానికి, క్రమశిక్షణ రంగంతోపాటు సాంస్కృతిక రంగానికి లీడర్లు, డిప్యూటీ లీడర్లను ఇబ్యాలెట్ విధానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే బూత్ అధికారులుగా, ఎలక్షన్ అధికారులుగా, ప్రిసైడింగ్ అధికారిగా పలు విధులను నిర్వహించారు. విద్యార్థులందరూ ఆసక్తిగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థుల నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే దిశగా, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే దిశగా ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయని తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్ రావు, రాకేశ్, వియయం ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, కోఆర్డినేటర్లు రబీంద్రపాత్రో, భవానీ, నిఖిల, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూరం కొమురయ్య మృతి చెందడం బాధాకరం

### సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/చిగురుమామిడి: చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త సూరం కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందడం సిపిఐ పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రేకొండలో సిపిఐ నేతలతో కలిసి లక్ష్మారెడ్డి, సూరం కొమురయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళ్ళర్పించారు. ప్రజా సమస్యలపై సిపిఐ నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని,పార్టీ బలోపేతం కోసం గ్రామంలో కృషి చేశాడని,మంచి కార్యకర్త కొమురయ్య మృతి చెందడం బాధాకరమని,ఆయన మృతి పట్ల సిపిఐ మండల సమితి తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ,వారి కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని లక్ష్మారెడ్డి చెప్పారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని వల్లభాయ్ పటేల్, తేరాల సత్యనారాయణ, ముద్రకోల రాజయ్య,నాయకులు తమ్మిశెట్టి రవీందర్ ,విలాసాగరం అంజయ్య, అయిలయ్య,శ్రీనివాస్, పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

ప్రజాపక్షం / గన్నేరువరం : గన్నేరువరం మండలం మైలారం గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ స్తంభం ఉండడంతో వాహనదారులు ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అయితే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు తెస్తారని స్థానికులు వాపోతున్నారు.

# శాతవాహనలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : శాతవాహన విశ్వ విద్యాలయంలో లైబ్రరీ ప్రాంగణంలో బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వర్షాకాల సాంస్కృతిక పండుగ తీజ్ ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. బంజారా సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలకు విశ్వ విద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు హాజరవగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాతవాహన ఉప కులపతి ఆచార్య యు.ఉమేశ్ కుమార్ విచ్చేసి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే తీజ్ పండుగ బంజారాల విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని కొనియాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటూనే తమ మూలాలను, సాంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. క్యాంపస్‌లో ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల మధ్య ఐక్యత, సృజనాత్మకత పెరుగుతాయని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య పి.సతీష్ కుమార్ మాట్లాడుతూ బంజారా సమాజం చాలా భక్తి శ్రద్ధలతో జరుపుకునే తీజ్ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ఇది వారి సంస్కృతికి అద్దం పడుతుందని ఈ ఉత్సవాలను ప్రతి సంవత్సరం జరుపుకోవాలన్నారు. అలాగే విశిష్ట అతిథులుగా ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్, లా



కాలేజీ ప్రిన్సిపల్ డా.పద్మావతి మాట్లాడుతూ బంజారా సంస్కృతి కలకాలం నిలవాలంటే వారి ఆచార సంప్రదాయాలైన పండుగలను వివిధ కార్యక్రమాలను జరుపుకోవాలని తెలిపారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్ తదితరులు పాల్గొని వేడుకలను పర్యవేక్షించారు. అనంతరం ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన బంజారా విద్యార్థి సంఘం ప్రతినిధులను, విద్యార్థులను అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు విశ్వ విద్యాలయ అధికారులను, ఆచార్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు అనిల్, తరుణ్, రామకృష్ణ, దివ్య బుల్లి తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు సిసి కెమెరాల నిఘా కీలకం

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

ప్రజాపక్షం / జమ్మికుంట : శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీ టీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. మండల పరిధిలోని సైదాబాద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను, కోరపల్లి గ్రామంలోని 5 సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం జమ్మికుంట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు సీపీ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి గ్రామం, పట్టణంలో ప్రతి మూలను సీసీ టీవీ నిఘా నీడలోకి తీసుకురావడమే పోలీసుల ముఖ్య ఉద్దేశమని రాబోయే రోజుల్లో కమిషనరేట్ పరిధిలో మరో 700 కొత్త కెమెరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత ఆన్‌లైన్ గేమింగ్ బారిన పడి డబ్బులు నష్టపోవడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాలోనూ ఇలాంటి సంఘటనలు వెలుగు చూస్తున్నాయని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసే డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని



గ్రామీణ ప్రాంతాల్లో వీటి సరఫరా లేదా వాడకంపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. యువత మత్తుకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించాలని వాహనదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి వారి ప్రాణాలను కాపాడేవారికి ప్రభుత్వం రహవీర్ పథకం కింద రూ.25 వేలు నగదు పురస్కారం అందిస్తుందని ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సైదాబాద్ సర్పంచ్ రాజారాం, కోరపల్లి సర్పంచ్ మధుసూదన్, స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామ ప్రజలకు సీపీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతిలతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణ ప్రక్రియను తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ మ్యాపింగ్ ప్రక్రియను గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీ చేశారు. నగరంలోని జ్యోతినగర్, మంకమ్మతోట, రేకుర్తి తదితర డివిజన్ల పరిధిలోని ప్రాంతాలలో పర్యటించి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు, మార్పుల ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఎస్ఐఆర్ వేగవంతం, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, వివరాల నమోదు తదితర విషయాలపై బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్దేశిత గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఓ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని నగరంలో ఎక్కడా ఎవరూ విస్మరణకు గురికాకుండా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సర్వే చేయాలన్నారు. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డేటాను ఎలాంటి తప్పులు, సాంకేతిక లోపాలు లేకుండా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా వంద శాతం పారదర్శకంగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, సూపరవైజర్లు పాల్గొన్నారు.



## విపత్తుల సమయంలో.. ఎడిఆర్ఆర్ఎఫ్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్లన్నపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. అప్పుడు ప్రతి నిమిషం విలువైనదని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ.. వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి.. ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయం ఆవరణ, లోపల కిచెన్, డైనింగ్ హాల్ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు, టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేయాలని దానికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా అధికారికి ఒక విద్యాలయం కేటాయించామని, వారు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు కావాల్సిన సివిల్ వర్క్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. అంగన్వాడీలు, ప్రభుత్వ స్కూల్ లలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు తప్పనిసరిగా ఇవ్వాలని, దీనిని ఆయా శాఖల అధికారులు పరిశీలించాలని సూచించారు. జిల్లా విద్యాధికారి మొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ట్రైబల్ డీసీఓలు, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుదర్శన్ రెడ్డి, టీజీఈడబ్ల్యుఐడీసీ అశోక్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : రేపు రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి జరుగుతున్న విద్యా సంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ బంద్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమాసాహెబ్ తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడిని అరికట్టాలని ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలలో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నేడు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ బంద్ ప్రత్యక్షంగా పాల్గొంటున్నట్లు భీమాసాహెబ్ తెలిపారు.

## వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంఖుస్థాపన

ప్రజాపక్షం / వీణవంక : గ్రామ ప్రజల ఆరోగ్యానికి తాగునీటి ఇబ్బందులను దూరం చేయడానికి బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ మండల కుమారస్వామి కీలక అడుగు వేశారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గురువారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాలంలోనే దీనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పథకాల రుణాలను పెండింగ్‌లో ఉంచొద్దు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రభుత్వ ప్రాయోజిత పథకాల రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని,తిరస్కరించాల్సి వస్తే సరైన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ పథకాల రుణాలు,వ్యవసాయ,ఎంఎస్ఎంఈ, పీఎం స్వనిధి రుణాల పంపిణీ, సామాజిక భద్రత పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద వచ్చే రుణ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు.అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని,తిరస్కరించే దరఖాస్తులకు సరైన కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.పశుసంవర్ధక శాఖకు సంబంధించిన రుణాల మంజూరుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.రుణాల మంజూరుకు అవసరమైన పత్రాల చెక్‌లిస్ట్‌ను సంబంధిత అధికారులు సిద్ధం చేసి దరఖాస్తుదారులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని, అవసరమైన పత్రాలతోనే దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.202526 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ పంట రుణాల లక్ష్యంలో ఇప్పటివరకు 77 శాతం మాత్రమే సాధించామని, 91,002 మంది రైతులకు రూ.1,488 కోట్ల పంట రుణాలు అందించినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో లక్ష్య సాధన 65.9 శాతం మాత్రమే ఉండటం సంతృప్తికరంగా లేదని పేర్కొంటూ, అన్ని బ్యాంకులు ఈ రంగంలో రుణాల పంపిణీని పెంచాలని ఆదేశించారు.జిల్లాలో రైతులకు రుణాల పంపిణీ మరింత పెరగాలని, ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకులు వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. బ్యాంకుల వారీగా రుణాల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.పీఏసీఎస్ (PACS) గోదాముల నిర్మాణానికి అవసరమైన రుణాలను అత్యవసరంగా మంజూరు చేయాలని, భూముల కేటాయింపు త్వరలో పూర్తవుతుందని, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా బ్యాంకులు సహకరించాలని కలెక్టర్ తెలిపారు.స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), మెప్మా రుణాల్లో ఎన్‌పీఏ ప్రస్తుతం 0.8 శాతం మాత్రమే ఉందని,దీనిని 0.5 శాతం కంటే తక్కువకు తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందన్నారు. మొండి బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు.పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాల పంపిణీని మరింత పెంచాలని కలెక్టర్ అన్నారు. మొదటి,రెండో విడత రుణాలను సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు మూడో విడత రుణాలు అందేలా బ్యాంకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) వంటి సామాజిక భద్రత పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అత్యధిక బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా అన్ని బ్యాంకులు తమ అర్హులైన ప్రతి ఖాతాదారుడికి ఈ బీమా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో మరింత పెంపొందించేందుకు గ్రామస్థాయిలో విస్తృతంగా ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 53 శిబిరాలు,రామగుండం,పెద్దపల్లి,మంథని పట్టణ ప్రాంతాల్లో 342 శిబిరాలు నిర్వహించినట్లు అధికారులు వివరించారు.లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్,నాబార్డ్ ఆర్బీఐ,ప్రతినిధులు,వివిధ బ్యాంకుల జిల్లా సమన్వయ అధికారులు,జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న సి.హెచ్.పి ఉద్యోగులు

**ప్రజాపక్షం/రామగిరి :** ఓ.సి.పి.1 సి.హెచ్.పి లో బొలెరో డ్రైవర్ గా పనిచేస్తున్న మెట్టు. రవి రత్నాపూర్ వాస్తవ్యుడు డ్యూటీ తరువాత పార్ట్ టైమ్ పని కొరకు గ్రామ సర్పంచ్ ఆదేశాను సారము గ్రామములో వీధి దీపాలను అమరస్తున్నా క్రమములో విద్యుత్తు షాక్ తగిలి పోల్ పైనుండి కింద పడి శ్రీ మయూఖ హాస్పిటల్ కరీంనగర్ నందు ట్రీట్‌మెంట్ తీసుకొను చున్నాడు. అతను ప్రస్తుతము ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని తెలిసి సి.హెచ్.పి ఉద్యోగులందరూ తమకు తోచిన విధంగా డబ్బులు ఒక లక్ష రెండు వందల రూపాయలు వారి కుమారుడికి గురువారం అందజేసారు.ఇట్టి కార్యక్రమానికి డివైజీయం కాశీ విశ్వేశ్వరరావు,గవ్వల శ్రీనివాస్, డివైఎస్ఈ అనిల్ కుమార్, పిట్ సెక్రెటరీలు గంధం శ్రీనివాస్,కిషన్ నాయక్,మరియు వివిధ యూనియన్ నాయకులు,అన్ని షిఫ్ట్ లా ఇంజనీర్స్,సూపర్వైజర్ లు,షిఫ్ట్ ఇంచార్జెస్ రిలే డి లక్ష్మీపతి,రాజనర్సు,రిలే ఏ,రంగా వేణు,వెంకటేష్,రిలే బి,కంప రమేష్,రాజేందర్,రిలే సి,ప్రసాదరావు,లెక్కల రామక్రిష్ణ,మహిళ ఉద్యోగులు,సి.హెచ్.పి.ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మంచినీటీ నాణ్యత ప్రమాణాలు పాటించాలని గ్రామపంచాయతీ అధికారులు పేర్కోన్నారు. గురువారం మండల పరిధిలో ఉన్న శుద్ధ జల కేంద్రాలను పరశీలించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రై డే కార్యక్రమం, సానిటేషన్ అంశములపై ఆరోగ్య కార్యకర్తలకు పంచాయతీ సిబ్బందికి గ్రామపంచాయతీ కార్యాలయంలో సూచించారు. వర్షాకాలంలో కాచి వడపోసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, అట్లాగే ఆర్వో వాటర్ ప్లాంట్ నీటిని టీడీఎస్ నాణ్యత ప్రమాణాలు పాటించిన పిదప మాత్రమే ఆ నీటిని త్రాగాలని, గ్రామంలో గల అన్ని వాటర్ ప్లాంట్ల యాజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేని పక్షంలో ప్లాంట్లను మూసి వేయడం జరుగుతుందని ఎంపీఓ మౌఖిక ఆదేశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌరీశంకర్, ఏఈ ప్రశాంత్, మిషన్ భగీరథ అధికారి, సర్పంచ్ నర్సింహులు, ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ బెల్ట్ షాప్‌ల పై పోలీసుల దాడి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై ఎస్ఐ వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అడవిపదిరలో భూక్య రవి తండ్రి శంకర్, వన్‌పల్లి గ్రామంలో కమటాల భూపతి తండ్రి శంకరయ్య ఇండ్లలో తనిఖీ చేయగా 15 లీటర్ల మద్యం బాటిల్లు లభించాయని, వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమ బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## రాజరాజేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ ఇవోగా బాధ్యతల స్వీకరించిన ప్రతాప నవీన్

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గతంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ)గా విధులు నిర్వహించిన ప్రతాప్ నవీన్ అనంతరం బదిలీపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, యాదగిరిగుట్టకు వెళ్లి అక్కడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ)గా పదోన్నతి పొంది కొంతకాలం సేవలందించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తిరిగి తమ మాతృ సంస్థ అయిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీ కాగా, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ ఈవో కార్యాలయ చాంబర్‌లో ఆలయ ఉద్యోగుల సంఘం తరపున ప్రతాప్ నవీన్ ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఉద్యోగుల సంఘ నాయకులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



## భీమేశ్వర సదన్‌లో నూతన సరళ నిలయం అతిథి గృహానికి శంకుస్థాపన

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధమైన శ్రీ భీమేశ్వర సదన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న "సరళ నిలయం" అతిథి గృహానికి గురువారం వేదమంత్రోచ్చారణల నడుమ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ అతిథి గృహ నిర్మాణానికి మాజీ పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు,మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్, ఏకశిల ఏడ్యుకేషన్ సొసైటీ వరంగల్ దాతలుగా సహకరిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో గతంలో 2007 మార్చి 28న తొలి అతిథి గృహం నిర్మించగా, ప్రస్తుతం దాని పైభాగంలో భక్తుల వసతి సౌకర్యాలను మరింత విస్తరించే లక్ష్యంతో మరో నూతన అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దాతలు, కుటుంబ సభ్యులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ దాతలను శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం, కండువాతో ఘనంగా సత్కరించారు. నూతనంగా నిర్మించనున్న "సరళ నిలయం" అతిథి గృహం పూర్తయిన తర్వాత వేములవాడకు విచ్చేసే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు.



## వేములవాడలో సీజనల్ వ్యాధుల నివారణకే స్పెషల్ డ్రైవ్

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ మున్సిపల్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుండి చెక్కపల్లి బస్టాండ్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మోరిల పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టారు. గురువారం స్థానికంగా జరుగుతున్న ఈ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ కొక్కుల బాల కృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందకుండా, తద్వారా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీలు, మోరిలలో నీరు సాఫీగా సాగిపోయేలా పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని, ప్రజారోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిరుపయోగంగా ఉన్న పాత్రలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఆగిన భూ రిజిస్ట్రేషన్లు గోస పడుతున్న రైతులు..

### రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ల సమస్య ఉన్నా పట్టిచ్చుకోని ప్రభుత్వం

### కేసీఆర్ ప్రభుత్వంలో ధరణీ ఉన్నపుడు ఎన్నడూ ఇంత సమస్య కాలేదంటున్న రైతులు

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలంలో భూ భారతి వెబ్సైట్ మొరాయించడంతో భూమి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. బుధవారం రిజిస్ట్రేషన్లకు కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శీలం స్వామి మాట్లాడుతూ సాంకేతిక లోపాల కారణంగా సర్వర్లు పనిచేయకపోవడంతో భూముల క్రయవిక్రయాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని, దీంతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్లాట్ బుకింగులు పెండింగ్లో పడిపోయాయని, స్లాట్లు బుక్ చేసుకున్న రైతులు రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సైట్ రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న ధరణి పేరు భూభారతి పెట్టి చేసింది ఏమీలేదని గతంలోనే ధరణి చక్కగా పని చేసేదని అన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ వేలాది సంఖ్యలో జరగాల్సిన లావాదేవీలు ఆగిపోయాయని, అప్పులు చేసి భూములు కొన్నవారు, ఆర్థిక అవసరాల కోసం అత్యవసరంగా భూములు అమ్ముకుంటున్న వారు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, సంబంధిత ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం వెంటనే స్పందించి సాంకేతిక లోపాలను సరిదిద్దాలని, త్వరితగతిన భూ భారతి సైట్ను పునరుద్ధరించి రైతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



# విద్యే మనిషికి నిజమైన సంపద

## ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**ప్రజాపక్షం/కోరుట్ల :** విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, గ్రామీణ ప్రాంతాల యువత కూడా ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ఇలాంటి విద్యా, విజ్ఞాన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ను రాష్ట్ర ప్రజలు,నాయకులు,అభినందించారు.కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, కోరుట్ల డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక టీహబ్ (THub), టీవర్క్స్ (TWorks) సంస్థలను సందర్శించారు.ఈ విద్యా పర్యటన ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు స్టార్టప్‌లు,ఆవిష్కరణలు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అవకాశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "విద్యే మనిషికి నిజమైన సంపద" అని అన్నారు.డిగ్రీ పూర్తి చేయడమే విజయానికి అంతిమ లక్ష్యం కాదని, ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నైపుణ్యాలను పెంపొందించుకుని, సృజనాత్మక ఆలోచనలతో కొత్త అవకాశాలను సృష్టించుకునే దిశగా ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన టీ హబ్, టీవర్క్స్ వంటి సంస్థలు యువతలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తూ, స్టార్టప్‌ల స్థాపన, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానం, మెంటరింగ్, పెట్టుబడుల అవకాశాలు వంటి అనేక రంగాల్లో విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు.ఈ అవకాశాలను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంలో భాగంగా విద్యార్థులు స్టార్టప్‌లు ఎలా ప్రారంభమవుతున్నాయి.కొత్త ఆలోచనలు విజయవంతమైన సంస్థలుగా ఎలా రూపుదిద్దుకుంటున్నాయి, అత్యాధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ సెంటర్లు, పరిశోధన సౌకర్యాలు ఎలా పనిచేస్తున్నాయి, యువతకు అందిస్తున్న శిక్షణ, సాంకేతిక సహకారం, పారిశ్రామిక మార్గదర్శకత్వం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి విలువైన అవగాహన పొందారు.ఈ విద్యా పర్యటన తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని, సృజనాత్మక ఆలోచనలకు కొత్త దిశ చూపిందని, భవిష్యత్తులో ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ,గ్రామీణ ప్రాంతాల యువత కూడా ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ఇలాంటి విద్యా,విజ్ఞాన,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కి విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు.



# గెలుపోటములు: సహజం ప్రజాసేవే ముఖ్యం

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/రాయికల్ :** రాజకీయంలో గెలుపోటములు సహజమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.అలాగే నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలకు హాజరై చీరలు కానుకగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూఅర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని అన్నారు.రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని ప్రజా సేవ ముఖ్యమని అన్నారు.తొంభర్రావు పెట్ వద్ద తూ మ్ ఏర్పాటు తో రాయికల్ నుండి బోర్నపల్లి వరకు తాగు సాగు నీటి గోస తీరిందన్నారు.ప్రభుత్వం తో కలిసి పనిచేసి నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేస్తానని,ముఖ్యమంత్రి మంత్రులు అందరి సహకారం తో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని,మహితాపూర్ గ్రామానికి 44 ఇండ్లు మంజూరు అయ్యాయి ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు.సఫాయి కార్మికుడు స్వామి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరూ కావడం ఆనందంగా ఉందన్నారు.మరింత సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించాలి ఆది ఒక్కటే నా ఏకైక కోరిక అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జగిత్యాల మెడికల్ కాలేజీ ఆదర్శనీయం.త్వరలో 750 పడకల ఆసుపత్రి సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.జగిత్యాల మహిళ డిగ్రీ కళాశాల అటానమస్ తో పాటు నూతన వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు.సన్న బియ్యం,ఉచిత బస్సు,200 యూనిట్ల ఉచిత కరెంట్,రేషన్ కార్డులు పంపిణీ,ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టి,9వేల కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేసుందని అన్నారు.గత ప్రభుత్వంలో రైతులు మరణిస్తే బీమా ఉంది నేడు రేవంత్ రెడ్డి సర్కార్ రైతులతో పాటు గల్ఫ్ లో కార్మికులు మరణిస్తే 5 లక్షల పరిహారం అమలు చేయడం జరిగిందని,త్వరలో ప్రతి కుటుంబానికి నిరుపేదల కోసం ఇందిరమ్మ ఆరోగ్య బీమా రానుంది అని అన్నారు. కొత్త పెన్షన్ లు త్వరలో ప్రారంభం కానున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు గాజంగి నందయ్య,ఉప్పుమడుగు సర్పంచ్ కొత్త కొండ రోజా నవీన్ గౌడ్ ,ఉప సర్పంచ్ అలెపు గంగాధర్,మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు,గ్రామ నాయకులు సురేష్,రాయికల్ మండల అల్లీపూర్ గ్రామంలో మాదాసు నర్సవ్వ గంగారాం గార్ల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. రాయికల్ మండల కిష్టం పేట గ్రామానికి చెందిన ఎలిగేటి గంగలక్ష్మి శ్రీనివాస్ మరియు ముల్క కళావతి ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా



అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు.1 కోటి 56 లక్షలతో కిష్టం పేట గ్రామం నుండి చల్గల్ వరకు బీటీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే,పనులు త్వరిత గతిన నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు,గ్రామ సర్పంచ్ ఆకుల అంజన్న గౌడ్, మాజీ ఏ ఎం సీ డైరెక్టర్ తిరుపతి గౌడ్,మాజీ సర్పంచ్ లు తంగేళ్ల రమేష్,సిరిపురపు సత్తన్న,మాజీ కో ఆప్షన్ సభ్యులు యం ఏ ముఖేద్,దొబ్బల వేణు,నరేష్, ఏజాజ్,ప్రేంచంద్,శ్రవణ్ ,అరుణ్,శ్రీనివాస్,గంగనర్సయ్య,లచ్చుక్క,కిష్టంపేట సర్పంచ్ ఆకుల అంజన్న గౌడ్,మాజీ ఏ ఎం సీ డైరెక్టర్ తిరుపతి గౌడ్,మాజీ సర్పంచ్ లు తంగేళ్ల రమేష్,సిరిపురపు సత్తన్న,మాజీ కో ఆప్షన్ సభ్యులు యం ఏ ముఖేద్,దొబ్బల వేణు,నరేష్,ఏజాజ్, ప్రేంచంద్,శ్రవణ్ ,అరుణ్,శ్రీనివాస్ ,గంగనర్సయ్య,లచ్చుక్క, పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయంలో చోరీ.. నగదు, ఆభరణాలు అపహరణ

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని తాళ్ల మండల ఎల్లమ్మ ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గౌడ సంఘ సభ్యుల సమాచారం ప్రకారం అమ్మవారి సుమారు రెండున్నర మాసాల బంగారు పుస్తెలతాడు,ఐదు మాసాల వెండి ఆభరణాలు,హుండీ పగుల గొట్టి నగదును అపహరించి నట్లు తెలిపారు.ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రూ.700 వివాదం.. ఇనుపరాడుతో దాడి

## ఒకరికి గాయాలు

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని బిసి కాలనీలో గురువారం రూ.700 నగదు విషయంలో ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది.స్థానికుల సమాచారం మేరకు,బిసి కాలనికి చెందిన భాషా ఖాన్ (35) మిట్టపల్లి రాహుల్ (19) మధ్య రూ.700 విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన రాహుల్, ఇనుపరాడుతో భాషా ఖాన్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయాలు తెలియాల్సివుంది.

# పాతికేళ్ల రుణభారం తొలగినవేళ



**ప్రజాపక్షం/ధర్మపురి :** సౌదీ అరేబియాలో కలిసి పనిచేసిన స్నేహితుడి వద్ద తీసుకున్న అప్పును 25 ఏళ్ల తర్వాత చిరునామా వెతుక్కుంటూ వచ్చి చెల్లించి ఋణభారాన్ని తొలగించుకున్న ఘటన గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో జరిగింది.కేరళలోని పాలక్కాడ్ జిల్లాకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, ధర్మపురికి చెందిన ఎడ్ల లచ్చన్నతో కలిసి సౌదీలో పని చేసే సమయంలో కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన ఇస్మాయిల్, లచ్చన్న చిరునామా తెలియక అప్పు తీర్చలేకపోయాడు.ఇటీవల గూగుల్‌లో వెతికి ధర్మపురికి చేరుకుని,స్థానికుల సహాయంతో లచ్చన్న కుటుంబాన్ని గుర్తించాడు. ప్రస్తుతం గల్ఫ్‌లో ఉన్న లచ్చన్నతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం రూ.25 వేల అప్పును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశాడు.పాతికేళ్లుగా మోస్తున్న రుణభారం తీరింది అంటూ భావోద్వేగానికి గురైన ఇస్మాయిల్ ఆనందంగా కేరళకు తిరుగు ప్రయాణమయ్యాడు. నేటి కాలంలో అప్పు తీసుకుని ఎగ్గొట్టే ఘటనలు పెరుగుతున్న వేళ, పాతికేళ్ల అనంతరం కూడా నిజాయితీ నిలబెట్టుకుంటూ ఇస్మాయిల్ అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

# గురుకుల బాలికల.. విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని టి.జి. ఎస్. డబ్ల్యూ.ఆర్.ఎస్./జే.సి. బాలికల గురుకుల బాలికల విద్యాలయాన్ని మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి, ఎంపీడీవో మహేందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యత,వంటగది పరిశుభ్రత,తాగునీటి సౌకర్యాలు,హాస్టల్ పరిసరాల పారిశుద్ధ్యం, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థినులకు నాణ్యమైన,పోషకాహారం అందించడంతో పాటు హాస్టల్ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

# పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి అండగా

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాఘవపేట గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుడిగా 8 సంవత్సరాలుగా పనిచేస్తూ ఇటీవలే మృతి చెందిన కడకుంట్ల బాబన్న కుటుంబానికి గ్రామపంచాయతీ పాలకవర్గం అండగా ఉంటుందని గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి గ్రామపంచాయతీ పాలకవర్గం నుండి 30 వేల రూపాయల నగదును ఆర్థిక విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్,ఉప సర్పంచ్ మద్దెల నరసయ్య, పాలకవర్గ సభ్యులు ,తదితరులు ఉన్నారు.



# వాసుదేవ శర్మ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ నాయకుడు గంగు ఉపేంద్రశర్మ ఖమ్మంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ జగిత్యాల జిల్లా ధూపదీప నైవేద్య అర్చకుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ గంగు ఉపేంద్రశర్మ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి అర్చకులకు తప్పుడు సమాచారం చేరవేస్తున్న వాసుదేవ శర్మ తన చర్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ధూపదీప నైవేద్య జిల్లా అధ్యక్షుడు నాగరాజు మహేంద్ర చార్య డిమాండ్ చేశారు.గతంలో రథయాత్రలు, చైతన్యయాత్రలు, హోమాల పేరుతో అర్చకులను తప్పుదోవ పట్టించి మోసం చేశారని విమర్శించారు.ఇకనైనా అలాంటి చర్యలను విరమించి ధూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.ధూపదీప నైవేద్య అర్చకులు ఐకమత్యంతో ముందుకు సాగితే తమ సమస్యలకు పరిష్కారం సాధించుకోవచ్చని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు మహేంద్రాచార్య, మాజీ అర్చక ఉద్యోగ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు తిరునహరి సత్యనారాయణాచార్యులు,గొల్లపల్లి మండల అధ్యక్షుడు కూర్మాచలం సత్యనారాయణాచార్యులు, అర్చకులు గోవర్ధన్ అనిల్,గణేష్ శర్మ,అనుపురం శ్రీనివాస్,ఆచార్య,తదితరులు పాల్గొన్నారు.



# నడికూడా గ్రామ సరిహద్దులు నిర్ణయించాలి



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని నడి కూడా గ్రామానికి చుట్టు సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు తాసిల్దార్ రామచందర్ కు గురువారం వినతిపత్రం అందజేశారు.మల్లన్న గుట్ట ఎల్లమ్మ గుట్ట గుడ్డేనుగుల గుట్టకు సర్వేర్ ద్వారా సరిహద్దులను చూపించాలని, గ్రామ సరిహద్దుల్లో ఇతరులు వ్యవసాయ పనులు చేయకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.గ్రామ సర్పంచ్ .తూర్పు సమతా రాజన్న, ఉపసర్పంచ్ మారుతి,వార్డు సభ్యులు లక్ష్మి, గంగు పద్మ,లావణ్య,రాజేశ్వర్,ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు.

## ఛాత్రోన్‌కా గుంజ్‌లో నాయకులు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** హైదరాబాద్‌లో రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కా గుంజో' లో భాగంగా జి ల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్‌గౌడ్ పాల్గొని మా ట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రబాబు, చరణ్‌గౌడ్, శ్యామ్‌రాజ్, మహేష్, శ్రీహరిగౌడ్, పాల్గొన్నారు.

## గుండెపోటుతో మహిళా సర్పంచ్ మృతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సర్పంచ్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటనతో గ్రామంలో విషాధ చాయలు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే సర్పంచ్ బెజ్జారపు పావని గురువారం గెండుపోటుతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యధిక భారీ మెజార్టీతో గెలిచి అందరితో ఆశయంగా ఉండే పావని మృతి చెందటంతో గ్రామస్తులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

## తెలంగాణ రైల్వే రంగం అపూర్వమైన వృద్ధి

### రైల్వే బడ్జెట్ 20రెట్లు పెంపు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రైల్వే రంగం అపూర్వమైన వృద్ధిని సాధించిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి కొనియాడారు. రికార్డు స్థాయి బడ్జెట్ 2014తో పోలిస్టే రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కేటాయింపులు 20రెట్లకు పైగా పెరిగాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 5,454 కోట్లు కేటాయించారని ఎంపీ వెల్లడించారు. హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్ రామారావు, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుధ్ పమార్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ టి.వి.దుర్గా ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారుల సమాక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అర్వింద్ ధర్మపురి మాట్లాడారు.

## సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినీల ధర్నా




**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ విశ్వ విద్యాలయం గర్ల్స్ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినీలు గురువారం ధర్నా నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ విశ్వవిద్యాలయం మెయిన్ క్యాంపస్‌లోని శివాజీ చౌక్ వద్ద బాలికల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ ధర్నా ను చేపట్టారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం లేకపోవడంతో ఈ ధర్నా చేపట్టామని విద్యార్థినీలు తెలిపారు. తమ హాస్టల్‌లో తాగునీరు, విద్యుత్, ఇంటర్‌నెట్ వైపై, ఒకే గదిలో పదుల సంఖ్యలో విద్యార్థినీలం ఇరుకుగా ఉండాల్సి వస్తుందని, హాస్టల్‌లోకి పాముల బెడద తదితర సమస్యలు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోపోవడంతో తాము రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని విద్యార్థినీలు వాపోయారు. ఇకనైనా తమ సమస్యను అధికారులు పరిష్కరించాలని వారు కోరారు. విశ్వవిద్యాలయ ం వైస్ ఛాన్సలర్ ధర్నా స్థలానికి చేరుకొని పలు దఫాలుగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వి ద్యార్థినీలకు హామినివ్వడంతో వారు ధర్నాను విరమించారు.

## టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

### ఆంకాలజిస్ట్, సర్జికల్ వైద్యులు చిన్నబాబు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఫ్లోరోసెన్స్ గైడెడ్, రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని హైటెక్ సిటీ యశోధ హాస్పిటల్ ఆంకాలజిస్ట్, సర్జికల్ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత దశాబ్ధంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించటం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తి నయం చేయటం, ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో ఒకటి రోబోటిక్ శస్త్ర చికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ, ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూ డ్యామేజ్, తక్కువ రక్తనష్టం వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయన్నారు. హైడెఫినిషన్ 3వ డివిజన్, ట్రేమర్ ఫ్రీ ఇన్‌స్టూమెంట్స్ మనిషి చేతి కదలికలను అనుకరించే ట్విస్టెడ్ ఇన్‌స్టూమెంట్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చన్నారు. సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పని చేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారన్నారు. తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, తక్కువ ఆస్పత్రి రోజులు, త్వరగా పనికి తిరిగి వెళ్లే అవకాశం మెరుగైన జీవన నాణ్యత తక్కువ మచ్చలు, కుటుంబ, భావోద్వేగ ఆర్థిక ఒత్తిడి తగ్గడం వంటి రోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు అన్నారు. ఈ విధంగా రోబోటిక్, ఫ్లోరోసెన్ గైడెడ్ టెక్నాలజీలు క్యాన్సర్ శస్త్రచికిత్సలను కేవలం వ్యాధి నివారణకే పరిమితం చేయకుండా రోగి జీవన నాణ్యతను కాపాడే దిశగా ముందుకు తీసుకెళుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు, రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చటం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం అన్నారు. సమావేశంలో హైటెక్ సిటీ యశోధ హాస్పిటల్ ఆరోగ్య మధు పాల్గొన్నారు.

## కడుపులో నుండి ఐదు కిలోల కణతి తొలగింపు



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** కడుపునొప్పితో బాధపడుతూ పట్టణ కేంద్రంలోని శివసాయి హాస్పిటల్‌లో సిరికొండ గ్రామానికి చెందిన పద్మ అనే 45 సంవత్సరాల బాధితురాలు చేరటంతో వెంటనే స్పందించిన ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సూర్యనారాయణ జనరల్ సర్జన్, స్త్రీ నిపుణురాలు హైందవి ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించి అనంతరం ఆపరేషన్ చేయటంతో కడుపులో నుండి 5 కిలోల కణతిని తొలగించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సాయికుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులచే కార్పోరేట్ స్థాయి వైద్యమందించుతున్నట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చులతో వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పద్మ కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు హరినారాయణ, అనిల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం

### మాజీ మేయర్, మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణకు రేవంత్‌రెడ్డి సరైన నాయకుడని ఇటు సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, అటు బీఆర్‌ఎస్ చేసిన అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని మాజీ మేయర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్ అన్నారు. గురువారం ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో విలేకరుల సమావేశంలో ధర్మపురి సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తుందన్నారు.గత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ, అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే అభివృద్ధి కొంత ఆలస్యమవుతుందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అభివృద్ధి చేయటం కాదని కాంగ్రెస్ విమర్శించటం సబబు కాదన్నారు. ఎప్పటికైనా సబ్బండ వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు.



గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి తెలంగాణకు దౌర్భాగ్యపు పరిస్థితి వచ్చేలా చేశారన్నారు. అప్పుల కుప్పగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయటం లేదని మాట్లాడటం హాస్యస్పదంగా ఉందన్నారు. ఈ రాష్ట్రం ఇలా ఉండటానికి కారణం బీఆర్‌ఎస్ కాదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ వచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం బిల్లు పెట్టించి ఆమోదించేలా చేశారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన పార్టీ, దేశానికి రాష్టానికి స్వాతంత్ర్యం తెచ్చిం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రాష్ట్రాన్ని జిల్లాను ఇంకా అభివృద్ధి చేసుకోవల్సిన అవసరముందని, రేవంత్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆయనను మించిన నాయకుడు లేడన్నారు. సిఎం తెలంగాణను అభివృద్ధి చేయటం కోసం సెలవు తీసుకోకుండా అహర్నిశలు పని చేస్తున్నారన్నా రు. నిజామాబాద్ అండర్ గ్రౌం డ్ డ్రైనేజీ పూర్తి చేసుకోవల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు . ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తుందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కష్టపడి పని చేసిన వారికి పదవులు వస్తాయని, ఇలాంటి పదవులు లేకున్నా తాను ప్రజల కోసం పని చేస్తున్నానన్నారు.

## సర్ ప్రక్రియను నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ గురువారం పలు ప్రాంతాల్లో సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూరల్ పరిధిలోని గాంధీనగర్ తండా, గూపన్‌పల్లి గ్రామాల్లో నిజామాబాద్ నగరంలోని శంకర్భవన్ పాఠశాలలో ఎన్యుమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు తీరును నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు సర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయింది, ఓటర్లందరికి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారమందించాలని గడువులోగా వారు తమ ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యుమరేషన్ ఫారాలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకవచ్చిన కలెక్టర్ బీఎల్‌ఓలకు సూచించారు. ఫారాల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్‌ను ఏకకాలంలో సమాంతరం నిర్వహించాలన్నారు. సకాలంలో సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌ఓలకు తగిన సహకారమందించాలన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజ్, తహసీల్దార్ వినయ్‌సాగర్ తదితరులున్నారు.

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పోలీసు విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమని జిల్లా సీపీ సాయి చైతన్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 3వ పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా గురువారం కమీషనరేట్ వేదికగా పోలీస్ విధినిర్వహణలో సామర్థ్యం పెంచడానికి తెలంగాణ జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026 (నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల) పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలతో పోలీసు విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుండి సిఐ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి ఇన్వెస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయి పనిలో పోటీతత్వం అలవాటుపడుతుందన్నారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్సై, పోలీసు ఇసబ్బందికి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ ఎంపికలు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకోవటం కోసం తమను తాము మెరుగుపర్చుకుని ఉత్తమ ప్రతిభ కనబర్చటం కోసం తద్వారా కన్వెన్షన్ పెంచటం కోసం ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రస్థాయిలోనూ రాణించి మంచి పేరు తీసుకరావలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు శుభం ప్రకాష్, ప్రకాష్ యాదవ్, రాజశేఖర్, శ్రీశైలం, నరేందర్, గురునాయుడు, నాగేంద్రబాబు, సిఐలు, ఎఎస్సైలు పాల్గొన్నారు.

## కాలానుగుణంగా తమను తామే మెరుగుపరుచుటకే....

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్స్‌గా మార్చుకోవడం, తమను తామె మెరుగుపరుచుకుని ఉత్తమ ప్రతిభ కనబరచుటకై పోలీస్ డ్యూటీ మీట్ అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. గురువారం నిజామాబాద్ కమిషనర్ కార్యాలయంలో జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026 కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రారంబించారు. ఈ సందర్భంగా నిజామాబాధ్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో సామర్త్యం పెంచడానికి తెలంగాణ రాష్ట్రంలో మూడవ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ మీట్ ద్వారా కానిస్టేబుల్ నుండి తమ విదుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం, పోలీసుల ప్రతిభను వెలికితీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమంలో సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫొరంసిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ నేరాలు జరిగినప్పుడు అట్టి నేరస్థలంలో సేకరించవలసిన నేర సమాచారం కోసం పోలీస్ క్లూస్ ఏవిధంగా సేకరించాలనే దానికోసం పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏసిపిలు ప్రకాష్ యాదవ్ (నిజామాబాద్), రాజశేఖర్ (సిటిసి), డాక్టర్ నాగేంద్రబాబు (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇన్‌చార్జి), జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సిఐలు, ఏఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ




**ప్రజాపక్షం / కౌటాల :** కౌటాల మండలంలోని మొగడ్ దగడ్ ఆశ్రమ ఉన్నత పాఠశాల తెలుగు పండిత్ డి.శ్రీనివాస్ ఆ పాఠశాల ఎఫ్ఎసి హెడ్మాస్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆయన బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అందరి సహకారంతో ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.

## ఎస్ఐ ఉదయ్ కిరణ్‌కు సన్మానం



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్‌ను హ్యూమన్ రైట్స్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జన్నారం పోలీస్ స్టేషన్‌లో గురువారం హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు దావుల మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దావుల మల్లేష్ మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కులకు సంబంధించిన ప్రతి సమస్యపై బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తూ, ప్రజలకు సేవలు అందించేందుకు హ్యూమన్ రైట్స్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జన్నారం మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్, ఆదర్శ ఫౌండేషన్ అధ్యక్షుడు లింగంపెల్లి రాజలింగం, సామాజికవేత్త మామిడి విజయ్, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారికి మరమ్మతులు

**ప్రజాపక్షం / కౌటాల :** మండలంలోని కన్నెపల్లి కనికి గ్రామాల మధ్య ఉన్న మట్టి రహదారిపై ఏర్పడిన గుంతలను మురుం పోసి మరమ్మతు పనులు చేపట్టారు. సర్పంచ్ మోర్లె పార్వతి ఆదేశాల మేరకు గురువారం ఈ పనులను నిర్వహించారు. రహదారి మరమ్మతులతో వర్షాకాలంలో గ్రామ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా మరిన్ని అంతర్గత రహదారులను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోర్లె సమత, రాజు, వార్డు సభ్యులు తిరుమలేష్, జయరాం, యువ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం / జైనూర్ :** మాంగ్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఉషేగాం గ్రామంలో గురువారం మాంగ్ సమాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహాలే దత్త ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్‌వాడ్ తులసీదాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలే దత్త మాట్లాడుతూ మాంగ్ కులస్తుల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చుతూ తహసీల్దార్ కార్యాలయాల ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం అభినందనీయమన్నారు. గతంలో ఆర్డీవో కార్యాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మాంగ్ సమాజ్ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. మాంగ్ కులస్తుల అస్తిత్వాన్ని పరిరక్షించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషేగాం సర్పంచ్ ఆత్రం నిర్మలశశిపాల్, జంగాం మాజీ సర్పంచ్ కుమ్ర శ్యాంరావు, ఉషగాం మాంగ్ సమాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడులే ప్రకాష్, నాయకులు కాంబ్లే సంగ్రామ్ మాంగ్, మోరే మహాదేవ్ మాంగ్, తారుడే గ్యానోబ మాంగ్, సూర్యవంశీ దత్త మాంగ్, మాంగ్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత




**ప్రజాపక్షం / కెరమెరి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్ లో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బడిబేట పిల్లలను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి అపార్ కార్డు కలిగి ఉండేలా చూడాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలం సరండి నార్లాపూర్ రహదారి సమీపంలో ఉన్న ఎంఎస్ఆర్ వైన్స్ మద్యం దుకాణాన్ని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బొట్టుపెల్లి జైరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు, వయసు నిర్ధారణ చేయకుండా యువతకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు బాలల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడతాయని, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుకాణం నుంచి మండలంలోని పలు గ్రామాలకు గుట్టుచప్పుడు కాకుండా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని జైరామ్ అన్నారు. కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని విమర్శించారు. మద్యం అందుబాటులో ఉండటం వల్ల కొందరు యువకులు, వ్యక్తులు అధికంగా మద్యం సేవించి వాంకిడి మండల కేంద్రంలోని రహదారులు, బస్‌స్టాండ్ పరిసరాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పడిపోతున్న ఘటనలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల సమీపంలో మద్యం దుకాణాల నిర్వహణ, మైనర్లకు మద్యం విక్రయాల ఆరోపణలు, అధిక ధరలకు విక్రయాలు, అక్రమ తరలింపుల వంటి అంశాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఓటరు జాబితా సవరణపై అవగాహన



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలం సమేల గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాడ్గురే సంతోష్, బూత్ లెవల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఇందులో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఫారాన్ని ఎలా పూరించాలి, దరఖాస్తులో నమోదు చేయాల్సిన వివరాలు, జత చేయాల్సిన అవసరమైన పత్రాలు, పాటించాల్సిన నియమ నిబంధనలను గ్రామస్థులకు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సరిచూసుకుని నిర్ణీత గడువులోగా ఫారాన్ని పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో సరైన సమాచారం నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని తెలిపారు. ఫారం నింపడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని కోరారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగస్వాములై తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్, గ్రామ వార్డు సభ్యులు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఓటు నమోదును నిర్లక్ష్యం చేయొద్దు మండల తహసీల్దార్ సతీష్

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** ఓటు హక్కు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని మందమర్రి మండల తహసీల్దార్ సతీష్ అన్నారు. గురువారం నాడు రామకృష్ణాపూర్ లోని పలు వార్డులను ఆయన సందర్శించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వెళ్లి పత్రాలను అందించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడానికి బూత్ లెవల్ ఆఫీసర్లు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఇంటింటి పర్యటన విధానం, కుటుంబాల వారీ చెక్‌లిస్ట్ తయారీ, కొత్త ఓటర్ల గుర్తింపు, అవసరమైన సవరణలు, ప్రజలతో సమన్వయం, బూత్ లెవల్ ఏజెంట్లతో సహకారం వంటి అంశాలపై వివరంగా మార్గనిర్దేశం చేశారు. ప్రతి అర్హుడి ఓటు ప్రజాస్వామ్యానికి అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఉపేంద్ర శర్మపై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం / జన్నారం :** ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడు గంగు ఉపేంద్ర శర్మపై దౌలతాబాద్‌కు చెందిన వాసుదేవ శర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జన్నారం మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ధూపదీప నైవేద్య అర్చకులకు ప్రస్తుతం అమలవుతున్న ధూపదీప నైవేద్య పథకం అందుబాటులోకి రావడంలో గంగు ఉపేంద్ర శర్మ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. చిన్న తరహా ఆలయాల అర్చకులకు రూ.2,500 నుంచి రూ.10,000 వరకు గౌరవ వేతనం, గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, విధి నిర్వహణలో మరణించిన ధూపదీప అర్చకులకు ఎక్స్‌గ్రేషియా వంటి సంక్షేమ పథకాలు తీసుకురావడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. వాసుదేవ శర్మ అర్చక లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అర్చకులందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మున్నూరు కాపు సంఘం నాయకులు గురువారం చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాళ్ల అవసరాన్ని వివరించడంతో పాటు సంఘ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దీనిపై చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారామ్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్ పటేల్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పటేల్, జిల్లా కోశాధికారి మిట్ట దేవేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందూరి తిరుపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అన్నం రమేష్, జిల్లా కార్యదర్శులు అంగాల తిరుపతి, దేవరనేని రవీందర్, జిల్లా నాయకులు గోవిందుల రాజన్న, కస్తూరి అఖిలేష్, సుంకరి వెంకన్న, కొత్తిమీర సర్పంచ్ నాయకిని సత్యనారాయణ, అంబిలపు అశోక్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన కార్యక్రమం, క్షేత్ర సందర్శన గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లాకు చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ప్రధాన శాస్త్రవేత్త డా. కె. రామచంద్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి,సాగు విధానాలు,సమతుల్య పోషకాల యాజమాన్యం,నీటి యాజమాన్యం మరియు వివిధ రకాల పురుగుల నివారణోపాయాలపై రైతులకు సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఆయిల్ పామ్ రైతులకు పెద్ద సమస్యగా మారే బంచ్ ఫెయిల్యూర్ (గెలలు రాలడం) అనే సమస్యకు గల శాస్త్రీయ కారణాలను,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు.పెద్దపల్లి జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు ఎంతో అనుకూలమైనదని ఆయన పేర్కొన్నారు. కేవలం 4వ సంవత్సరం తోటల నుంచే రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారని కొనియాడారు. రైతులందరూ శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ అవగాహన సదస్సు,క్షేత్ర సందర్శన కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జి. శ్యాం ప్రసాద్,తిరుమల ఆయిల్ కెమ్ సీఈఓ కె. కళ్యాకర్,ఉద్యాన అధికారి ఎ. జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి రాజశేఖర్,ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్, రంజిత్ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక రైతులు సమ్మయ్య, బుచ్చంరావు,లింగారావు,రాజేశ్వర్ రావు,సంపత్ రెడ్డి, పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల త్రీ-ఫేస్ కరెంట్ ఇవ్వాలి

### మాజీ ఎంపిపి,సర్పంచ్ అత్తె చంద్రమౌళి డిమాండ్

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల రైతులకు వ్యవసాయం కోసం తక్షణమే 24 గంటల త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని ముత్తారం మాజీ ఎంపీపీ,లక్కారం సర్పంచ్ అత్తె చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం ఆయన ముత్తారంలో మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం వర్షాలు లేక సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ బావుల్లో ఉన్న చాలీ చాలని నీటితోనైనా పంటలు సాగు చేసుకుందామంటే, కరెంట్ లేక రైతాంగం అయోమయ పరిస్థితిలో పడిపోయిందన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం 9 గంటల త్రీఫేస్ కరెంట్ ఇస్తున్నామని చెప్తున్నప్పటికీ, అందులోనూ గంటల కొద్దీ ట్రిప్పింగ్ అవుతూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్రంలో విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని చంద్రమౌళి విమర్శించారు. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి, రైతులకు 24 గంటల నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

# ‘సర్’ ఫారముల ఆన్ లైన్ పూర్తి చేయాలి

### -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం బాసర,తానూర్,కుబీర్,మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.ముందుగా బాసర గ్రామపంచాయితీ ఆవరణలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు.ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం తానూరు మండలం సింగన్ గావ్ గ్రామపంచాయితీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు, తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారములు నింపుటలో ఓటర్లకు సహాయం చేయాలని బిఎల్ఓ లకు అధికారులకు సూచించారు.ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ లో వివరాలను పరిశీలించారు. సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలలో తహసీల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి,ఎంపీడీఓ శ్రీనివాస్,సర్పంచ్ లు వెంకటేష్ గౌడ్,అన్నపూర్ణ, సాయినాథ్ లు, ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పునర్నిర్మాణమే ఎబివిపి లక్ష్యం

### జాతీయ కార్యవర్గ సభ్యులు బోడ లక్ష్మణ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని, జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బోడ లక్ష్మణ్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో జూలై 9న జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని స్థానిక వివేకానంద విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడ లక్ష్మణ్ మాట్లాడుతూ, కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ, నేడు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 78 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందని కొనియాడారు.నాడు ఏబీవీపీ చేసిన నినాదాలే నేడు దేశానికి విధానాలుగా మారాయని ఆయన స్పష్టం చేశారు. కాశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు కోసం ఉద్యమించి విజయం సాధించిన ఘనత, అక్రమ వలసదారుల ఏరివేతకు 'సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో' అంటూ జాతీయ భద్రత కోసం చేసిన పోరాటాలు ఈశాన్య రాష్ట్రాలు భారత్తో బలంగా నిలవడానికి కారణమయ్యాయని గుర్తుచేశారు.తెలంగాణ, బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నక్సలైట్ల తూటాలను ఎదుర్కొని జాతీయవాదాన్ని పెంపొందించడానికి ఎంతో మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారని లక్ష్మణ్ భావోద్వేగంగా పేర్కొన్నారు. వామపక్షాల వ్యక్తి నిర్మూలన సిద్ధాంతం దేశంలో తుడిచిపెట్టుకుపోయిందని, ఏబీవీపీ నమ్ముకున్న జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెకూ, ప్రతి ఇంటికీ విస్తరించిందని అన్నారు. వివేకానందుడి విగ్రహం వద్ద కాగడా, జెండా పట్టుకుని 'భారత్ మాతా కీ జై' అంటూ వేలాదిగా తరలివచ్చిన విద్యార్థుల ఉత్సాహమే దీనికి నిదర్శనమన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే విశ్వగురువుగా నిలిపేందుకు ఏబీవీపీ సాగిస్తున్న విద్యార్థి భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏబీవీపీ నిర్మల్ జిల్లా కన్వీనర్ దినేష్తో పాటు ప్రతినిధులు నితీష్,వంశీ,అభి,సాయి చరణ్,కార్తీక్, మణి విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ఇలా.. ప్రయాణం చేసేది ఎలా ..?

### గుంతల్లో చిక్కుకున్న మాయాపూర్ గ్రామం
### ప్రయాణం నరకంగా
### మారిందని వాపోతున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** చిన్నపాటి వర్షం కురిసినా బయటకు వెళ్లడం కష్టంగా మారింది. గుంతలు, బురదతో నిండిన రోడ్లపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇది నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలంలోని మాయాపూర్ గ్రామస్తుల దుస్థితి.మాయాపూర్ గ్రామానికి వడ్డేపల్లి ఎక్స్ రోడ్ నుండి చిట్యాల ఎక్స్ రోడ్ వరకు సుమారు 4 కి.మీ. రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు ప్రధానమంత్రి సడక్ యోజన క్రింద బీటీ రోడ్డుగా ఉన్న ఈ రహదారి మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయి పెద్ద పెద్ద గుంతలు గుంతలుగా మారింది. వర్షం పడిన వెంటనే ఆ గుంతలన్నీ నీటితో నిండిపోయి రోడ్డు ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.నాలుగు కి.మీ. కు అరగంట ప్రయాణానికినిర్మల్భైంసా జాతీయ రహదారికి కేవలం 4 కి.మీ. దూరంలో ఉన్నప్పటికీ, ఈ శిథిల రోడ్డు కారణంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడానికి సగం గంట సమయం పడుతోంది.అత్యవసర సమయాల్లో అంబులెన్స్, స్కూల్ వాహనాలు కూడా గ్రామానికి రావడానికి ఇబ్బంది పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అభివృద్ధికి ఆమడ దూరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ గ్రామం సిర్గాపూర్కు అనుబంధ గ్రామంగా ఉండేది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో గ్రామ అభివృద్ధి జరుగుతుందని గ్రామస్తులు ఆశపడ్డారు. కానీ గ్రామ పంచాయతీ ఏర్పడి ఏళ్లు గడిచినా మాయాపూర్ అభివృద్ధికి నోచుకోలేదు. చిట్యాల రోడ్డు నుండి ముజ్గీ వరకు రహదారిని రెండు వాహనాలు వెళ్లేలా వెడల్పు చేసినప్పటికీ, మాయాపూర్ను కలుపుతున్న ఈ 4 కి.మీ. రోడ్డును మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండ్రోడ్డు దుస్థితి కారణంగా రోజూ విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును వెంటనే మరమ్మతులు చేసి గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం కల్పించాలని మాయాపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.



## బురద రోడ్డుకు మోక్షం

### తీరిన ప్రయాణికుల, రైతుల కష్టాలు
### సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు,గ్రామస్తులు

**ప్రజాపక్షం/ముత్తారం :** సర్పంచ్ పోరాటానికి జాతీయ రహదారి కాంట్రాక్టర్ దిగివచ్చారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామంలో అధ్వానంగా మారిన బురద రోడ్డుపై బుధవారం కాంట్రాక్టర్ మొరం పోయించి, రోడ్డును సమం చేయడంతో ప్రయాణికులకు, రైతులకు ఇబ్బందులు తొలిగాయి.ధర్నాతో కదిలిన యంత్రాంగం జాతీయ రహదారి పనుల వల్ల ఓడేడ్ గ్రామ రోడ్డు బురదమయంగా మారి వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులు జాతీయ రహదారి నిర్మాణ వాహనాలను అడ్డుకున్నారు.రోడ్డుపై మట్టి పోసి బాగుచేసేంత వరకు వాహనాలను కదలనివ్వేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.ఈ నిరసన వార్తను 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించింది.సమస్యను పరిష్కరించిన కాంట్రాక్టర్పత్రికా కథనం, సర్పంచ్ హెచ్చరికతో స్పందించిన నేషనల్ హైవే ఇన్చార్జ్ కాంట్రాక్టర్ బుధవారం ఉదయం రంగంలోకి దిగారు.భారీ వాహనాలతో బురద గుంటలను సమాంతరంగా మార్చారు.మొరం (మట్టి) తెప్పించి బురద రోడ్డుపై పోయించడంతో ఇటు వాహనదారులకు, అటు రైతులకు ప్రయాణ సమస్య పూర్తిగా తీరిపోయింది.ప్రజా సమస్యపై తక్షణమే స్పందించి,పోరాడి రోడ్డు సమస్యను పరిష్కరించిన ఓడేడ్ గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గానికి ప్రయాణికులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు.

## వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి గ్రామంలో ముదిరాజ్ కుల దైవమైన పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు,భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.గ్రామస్తుల అందరి సహకారంతో ఈ బోనాల పండుగ అత్యంత భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గద్దం రాజేశం,ఉపసర్పంచ్ జన్నె శ్రీవాణి ప్రవీణ్,వార్డు సభ్యులు సిద్ద సమ్మయ్య,అనవేనా తిరుమల సాయికుమార్,గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## ప్రమాదకరంగా జాతీయ రహదారి బ్రిడ్జి నిర్మాణం

### కూలుతున్న మట్టి.. భయంలో వాహనదారులు

**ప్రజాపక్షం/ముత్తారం :** జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారంకాజిపల్లి గ్రామాల మధ్య జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం వాహనదారులకు,స్థానికులకు ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజుల క్రితం ఇక్కడ నేషనల్ హైవే అధికారులు బ్రిడ్జి పనులను ప్రారంభించారు.అయితే, ఈ నిర్మాణ ప్రాంతం ప్రధాన రహదారికి అంటుకునే ఉండటంతో, పనుల కోసం తవ్విన భారీ గుంతల పక్కనే ఉన్న మట్టి ఒక్కసారిగా కూలిపోయింది.రహదారి పక్కనే మట్టి కూలిపోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.రాత్రి వేళల్లో ఇక్కడ సరైన లైటింగ్ లేకపోవడం, హెచ్చరిక బోర్డులు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తగిన రక్షణ చర్యలు చేపట్టాలని,ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంలో సర్పంచ్ ప్రత్యేక చొరవ

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి తక్షణమే స్పందించి,విద్యుత్ అధికారులతో మాట్లాడి పాఠశాల ఆవరణలో అదనపు విద్యుత్ స్తంభాన్ని (మిడిల్ పోల్) ఏర్పాటు చేయించారు. దీనితో పాటు గ్రామంలోని కజ్జం రమణయ్య ఇంటి వద్ద తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను కూడా పైకి మార్పించి సమస్యను పరిష్కరించారు.ఈ దీర్ఘకాలిక సమస్యలను చొరవ చూపి పరిష్కరించిన సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్ మరియు గ్రామ పాలకవర్గానికి ఓడేడు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

- జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా, విద్యార్థుల హక్కుల సాధన కోసం జూలై 10వ తేదీన నిర్వహించ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామ పక్ష విద్యార్థి సంఘాలు (SFI, AISF, PDSU) పిలుపునిచ్చాయి. ఈ మేరకు నిర్మల్ జిల్లా ట్రస్మా (TRSMA) అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, చంద్ర గౌడ్ లకు విద్యార్థి సంఘాల నాయకులు వేర్వేరుగా బంద్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు దిగంబర్ (SFI), కైలాస్ (AISF), వెంకటేష్ (PDSU) మాట్లాడుతూ,విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయడంలో, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కాలేజీలో తక్షణమే తరగతులను నిర్వహించాలని, అలాగే జిల్లా కేంద్రంలో నవోదయ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వమే ఉచితంగా టెక్స్ట్ బుక్స్,నోట్ బుక్స్ అందించాలని,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం 1500 రూపాయలు చెల్లించి తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జీవోల ప్రకారం ఫీజులను నియంత్రించడంతో పాటు,అడ్డగోలుగా ఫీజులు పెంచే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.వీటితో



పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు.ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై రేపు జరుగుతున్న విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు,మేధావులు,తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని, అందరూ స్వచ్ఛందంగా విద్యాసంస్థలను మూసివేసి ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటింటికి మొక్కలు పచ్చదనమే లక్ష్యం





**ప్రజాపక్షం/నర్సాపూర్ :** జి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సంకల్పంతో తిమ్మాపూర్ జి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను అందజేస్తూ, ప్రతి ఇంటి ముందు కనీసం ఆరు మొక్కను నాటి సంరక్షించాలని అవగాహన కల్పించారు.ఒక మొక్క నేడు నాటితే, రేపటి తరాలకు స్వచ్ఛమైన గ్గాలి, ఆరోగ్యకరమైన జీవనం అందుతుంది అని పేర్కొన్నారు.గ్రామస్థులు కూడా ఉత్సాహంగా మొక్కలను స్వీకరించి వాటిని సంరక్షిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు,గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భైంసా సబ్‌డివిజన్‌లో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించిన ఏఎస్పీ

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల తో ఏఎస్పీ ఆధ్వర్యంలో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీజీపీ సమీక్షలో సూచించిన అంశాలు,గత క్రైమ్ రివ్యూ సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు,సంచలన కేసుల దర్యాప్తు పురోగతి, చార్జ్‌షీట్ల దాఖలు,వారెంట్ల అమలు, పిటిషన్ల పరిష్కారం, సైబర్ నేరాల దర్యాప్తు, మహిళలు,చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణ,ట్రాఫిక్ అమలు,నేరాల నియంత్రణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.దర్యాప్తు అధికారులు ప్రతి కేసును నాణ్యతతో,సకాలంలో పూర్తి చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసులు,పిటిషన్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

## విద్యార్థుల హక్కుల కోసం పోరాడుదాం

**ప్రజాపక్షం/భైంసా :** రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న నిర్వహించనున్న చలో ప్రజా భవన్ కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని USFI నిర్మల్ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి కార్పొరేట్ విద్యకు ప్రోత్సాహం ఇస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతోందని మండిపడ్డారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వెంటనే పంపిణీ చేయాలని, ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫారాలు అందించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు,లెక్చరర్లు, వార్డెన్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే బీసీ వసతిగృహాల్లో ఆన్‌లైన్




ప్రవేశ విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని,పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్య హక్కును కాపాడుకోవాలంటే పోరాటమే మార్గం. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి విద్యార్థి, యువకుడు జూలై 10న జరిగే చలో ప్రజా భవన్" కార్యక్రమంలో భారీగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ పిలుపునిచ్చారు.

## పోషకాహార లోపంలేని జిల్లాగా తీర్చిదిద్దాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, వైద్య శాఖ అధికారి రాజు లతో కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ జిల్లా పోషణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని వైద్య శాఖ సాయంతో ఎన్ఆర్సీకి పంపించాలన్నారు. అక్కడ ప్రత్యేక ఆహారం, చికిత్స ద్వారా పిల్లలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. మునగ, కరివేపాకు, నిమ్మ వంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పోషణ వాటికలు ఏర్పాటు చేయ్యాలని ఆదేశించారు. పోషణ వాటికలలో కచ్చితంగా మునగ మొక్కలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పెట్టాలని చెప్పడం జరిగిందని 15వ తేదీ వరకు అందరూ పిల్లల పోషణ స్థాయిని గుర్తించి ఈ నెలకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలన్నారు. జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిట్లు తెలిపారు. విద్యాశాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళిక అబద్ధంగా ముందుకు పోవాలన్నారు. సమావేశంలో ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎఐటియుసి 4 వ మహా సభలను విజయవంతం చేయండి

కార్మిక వర్గానికి పిలుపు

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో 4 వ జిల్లా మహా సభలకు జులై 14 న, పెన్షనర్ భవన్ నిర్మల్ లో జరుగునని, ఉదయం 10 గంటలకు గాంధీ పార్క్ నుండి ర్యాలీ ని విజయవంతం చేయాలనీ ప్రచారం బైంసా పట్టణం లో చేపట్టారు. ఏఐటీయూసీ సంఘటీత, అసంఘటిత కార్మికుల హక్కులకై గత 106 సంత్సరాలుగా పోరాటం చేస్తున్నాదాని, కనీసం వేతనం 26000/ ఇవ్వాలను,బ్యాంకు, ఇన్సూరెన్స్, డిఫన్స్ రంగాలలో ప్రైవేటికర్ణ కు వైతిరేకంగా జాతీయ 24 సమ్మె చేసినదానికి అన్నారు.Rtc, బ్యాంకు,అంగన్వాడీ,మధ్యాహ్నం భోజనం కార్మికులు సివిల్ సప్లై హమాలీ, పెయింటర్ యూనియన్ కార్మికులు వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మిక సంఘము కార్మికులు జిల్లా వైప్తంగా అధిక సంఖ్య లో హాజరై విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమం లో కామ్రేడ్ ఎస్ విలాస్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి,కామ్రేడ్ శ్రీనివాస చారి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ పెండరి ముత్యం, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి,కామ్రేడ్ లతీఫ్,గోపి, జావీద్,లక్ష్మ ణ్, అనిల్, పెయింటర్ యూనియన్ నాయకులు,విట్టల్ హమాలీ, కామ్రేడ్ ఎస్ కె హాజీ, బి సందేశ్, సత్వజీ, విట్టల్, సావిత్ బాయి, సయ్యబాయి,AMC యూనియన్ నాయకులుపాల్గొన్నారు.

## చేన్లలో పవర్ వీడర్ (దౌర) యంత్రంతో కలుపు నివారణ

**ప్రజా పక్షం/నర్సాపూర్ :** జివ్యవసాయంలో పెరుగుతున్న కూలీల కొరత, అధిక వ్యయాలకు చెక్ పెట్టేందుకు రైతులు ఆధునిక వ్యవసాయ యంత్రాల వైపు అడుగులు వేస్తున్నారు.ఇందులో భాగంగా చేనులో దౌర (పవర్ వీడర్) యంత్రం ద్వారా కలుపు మొక్కలను తొలగిస్తూ భూమిని గాలియాడేలా చేస్తున్నారు.ఈ యంత్రం వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తవడంతో పాటు, కూలీల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. భూమిలో తేమ నిల్వ ఉండటానికి, పంట వేర్లు బలంగా పెరగడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని,నర్సాపూర్ జీ మండలం తిమ్మాపూర్ జి గ్రామనికి చెందిన కొత్తపల్లి లక్ష్మ ణ్ అనే రైతు ఈ యంత్రం పని తీరును వివరించాడు.

## నిర్మల్‌లో 'కెబి హోమియో కేర్ క్లినిక్' ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'కెబి హోమియో కేర్ క్లినిక్' గురువారం వైభవంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి క్లినిక్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన క్లినిక్ నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు నాణ్యమైన,నమ్మకమైన హోమియో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఈ క్లినిక్ విశేష సేవలు అందించాలని,భవిష్యత్తులో మరెన్నో విజయాలు అందుకొని ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్పీ రాజు, గోపు గోపి, పెండం శ్రీనివాస్,ఎఫ్ఎస్‌సీఎస్ (FSCS) చైర్మన్ ధర్మాజీ రాజేందర్,ప్రముఖ నాయకులు నాలం శ్రీనివాస్, తదితరులు పాల్గొని క్లినిక్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

## సైదా స్వచ్ఛంద సంస్థ ద్వారా అంగన్వాడీలకు ఆట వస్తువుల పంపిణీ

**ప్రజా పక్షం/పెంబి :** మండలంలోని జంగగూడ జిపి పరిధిలో రాము గూడ అంగన్వాడి సెంటర్ లో సైదా CYDA స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆట వస్తువులు పంపిణీ చేయడం జరిగింది.రామ్ గూడా అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు లేకపోవడం మూలంగా సైదా అనే స్వచ్ఛంద సంస్థ గుర్తించి చిన్నపిల్లలు ఆడుకోవడానికి రకరకాల రంగుల్లో ఆట వస్తువులు పంపిణీ చేశారు.ఇందులో చిన్నపిల్లలు ఊగడానికి ఉయ్యాలతో పాటు ఇంకా అప్ అండ్ డౌన్ బల్లలు ఇతర వస్తువులు పంపిణీ చేశారు.ఇందులో జి పి సి ఆర్ పి లు నల్వాడ్ బాలాజీ షిండే ,పాండురంగ,తదితరులు పాల్గొన్నారు.